# శ్రీవారి రాత్రి

ఎం. వీరేశ్వరరావు



మా వారికి ఏదైనా విషయం గురించి విపరీతంగా ప్రిపేరయితే అది చివరి సమయంలో బెడిసి కొట్టడం అలవాటయ్యింది!

ఈయన డిగ్రీ వెలగ బెట్టేటప్పుడు విపరీతంగా సిద్ధపడ్డారట. పుస్తకాలు, గైడ్లు, లెక్చరర్స్‌ని కాంటాక్ట్ చెయ్యడం, ఫ్రెండ్స్‌తో డిస్కషన్ అలా చేస్తే చివరికి ఫైనల్ ఇయర్‌లో ఒక సబ్జెక్ట్ ఉండి పోయిందట. ఇదంతా విపరీతమైన ప్రిపరేషనే అన్నారట చుట్టూ ఉన్న ఫ్రెండ్స్.

ఈయన నా పదో పెళ్ళి చూపులో కలిసాడు. అప్పటికే పెళ్ళి చూపులతో విసిగిపోయిన నేను తిక్క తిక్కగా జవాబులు ఇచ్చాను. కానీ ఆయన నన్ను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడ్డారు. ఎందుకంటే ఆయన నా జవాబులు 'సైకలాజికల్‌గా' అర్థం చేసుకున్నారట! ఆయనకి 'సైకాలజీయుడు' అని పేరు పెట్టారు లెండి నా తరపు బంధువులు. ఇంకేం పెళ్ళి కుదిరింది! సరిగ్గా అదే సమయంలో మా వారి వైపు ఎవరో ముసలావిడ జారి పోయిందట! దాంతో మా పెళ్ళి ఆరు నెలలు వాయిదా పడింది! ఈలోగా వారు ప్రేమ లేఖలు వెలిగించారు. అందులో కూడా సైకాలజీ గొడవే! ఫ్రాయిడ్, ఆడ్లర్, జంగ్, భంగ్ అంటూ..

★★★★★

ఆ రోజు అనుకున్న ముహూర్తానికి పెళ్ళి అయిపోయింది! పెళ్ళి తరువాత కార్యక్రమం ఉంటుందిగా!

దానికోసం మా వారు విపరీతంగా ప్రిపేర్ అయ్యారు. వాత్స్యాయనుణ్ణి అటూ ఇటూ తిరగేశార్ట!

★★★★★

సరిగ్గా ఆరోజు వచ్చింది. మా వార్ని ముందే గదిలోకి తోసారు.

లోపల ఆయన వాత్స్యాయన సూత్రాలు నెమరు వేసుకుంటున్నారు. కొంతమంది అమ్మలక్కలు నా చెవిలో గొణిగారు. వాళ్ళ రాత్రులు గుర్తు కొచ్చి సిగ్గుపడి పోతున్నారు. పాతకాలం పందిరపట్టు మంచం మీద ఏర్పాటు చేసారు.

పది దాటాక లోపలకి నేను వెళ్ళాను. ఈయన నన్ను చూసారు. భుజం చుట్టూ చెయ్యివేసి మంచం వైపు తీసుకువెళ్ళారు!

సరే ఆయనలో వాత్స్యాయనుడు వచ్చాడు. నా నుదిటి మీద చుంభించ పోయారు. సరిగ్గా అదే సమయంలో జరిగింది.!

నా కాలికేదో మెత్తగా తగిలింది!

చూస్తే త్రాచుపాము. మా ప్రక్క కింద! ఆయనకి చూపించాను! ఆయన చూసారు. ఆ! అంటూ ఆశ్చర్యపోయారు! తరువాత ఇద్దరికీ భయంతో మాట రాలేదు. రెండు గంటలు గడిచిపోయాయి. మాలో భయం తగ్గలేదు! పాము కదలకుండా చుట్ట చుట్టుకొని పడుకుంది!

బయటవున్న వాళ్ళు లోపల ఏవో అద్భుతాలు జరుగుతున్నట్టు భావిస్తున్నారు!

మా వారు గొంతు పెగల్చుకొని గట్టిగా కేకవేసారు!

'తలుపు తీయండ్రా'

తలుపు తెరుచుకుంది! మేము భయంతో తడిసిపోవడం స్పష్టంగా కనిపించింది!

'ఏమయ్యింది' అన్నారు. సుమారు ఇరవై మంది గుమ్మం దగ్గర పోగుపడ్డారు.

'మంచం క్రింద క్రింద' అన్నారు వారు!

'జరిగేదే ఏదో పైన జరుగుతుంది! మంచం క్రింద ఏమిటి నా బొంద' అని ఒకాయన జోకాడు! వారికి కోపం వచ్చింది.

క్రింద చూసారందరూ! అక్కడ ఇంకా త్రాచుపాము చుట్ట చుట్టుకొని ఉండడం స్పష్టంగా కనిపించింది.

'ఎవరైనా ధైర్యవంతులు పాముని చంపండి' అని ఒకావిడ సజెస్ట్ చేసింది.

'పామా! కార్యం గదిలోకి!' అంటూ ఒక ముసలావిడ గట్టిగా నవ్వింది. 'మరీ చోద్యం' అందావిడ. మీరూరుకోండి. పాము సంగతి చూడండి' అన్నాడు ఇంకొకాయన!

పాము కదిలి గుమ్మం దాటింది! మా వారు మంచం దిగారు!

దాని వెనుక వెళ్ళారు! అలా పాము మా ఇల్లు దాటి కొద్ది దూరంలో వున్న పొదలోకి వెళ్ళింది.

అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు!

పొదదగ్గరకు వెళ్ళిన మా వారు ఒక సంగతి చూసి నా చెవిలో ఊదారు!

“అది ఏమిటంటే ఆ పాము మంచం క్రింద వున్నది మగదిట. తన భార్య ఆడపాముని పొదలో కలుసుకుందికి వెళ్ళిందట! పామయినా, పురుషుడైనా స్త్రీ ఆకర్షణ నుండి తప్పించుకోగలడా?' అన్నారు వారు.

సమయం నాలుగయింది.

వారిని నిద్ర దేవత కౌగిలిలోకి తీసుకుంది! కొద్ది సేపటికి వారు 'గురక' ప్రారంభించారు.

'క్రొత్తగా పెళ్ళయిన అమ్మాయితో ప్రక్కింటావిడ అడిగిందట. “మీ ఆయన గురక పెడతాడా?' అని.

'ఏమో నాకేం తెలుసు మా పెళ్ళయి మూడు రోజులే కదా అయ్యింది” అందా పెళ్ళి కూతురు.

ఆరు అయ్యింది! వారు లేచి 'తెల్లారి పోయింది! తొలిరాత్రి తెల్లారి పోయింది” అంటూ విసుగ్గా అరిచారు!

కానీ తొలికన్నా మలిరాత్రి మధురంగా గడిచిపోయింది!